సాక్షి నల్లగొండ

శనివారం । 14 । డిసెంబర్ । 2024



విద్యతోనే ఉన్నత స్థాయికి..
విద్యార్థులు విద్యతోనే ఉన్నత స్థాయికి చేరుకోగలుగుతారని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. - 8లో



క్రిస్మస్ కానుకలు లేనట్టే!
క్రిస్మస్ సందర్భంగా గత ప్రభుత్వం పేద క్రైస్తవులకు పంపిణీ చేసిన కానుకలను ప్రస్తుత ప్రభుత్వం నిలిపివేసింది. - 8లో



మానవ సంబంధాలతోనే..
మానవ సంబంధాలతోనే మార్పు సాధ్యమవుతుందని ప్రముఖ రచయిత, విరసం నేత అల్లం రాజయ్య అన్నారు. - 8లో

న్యూస్‌రీల్

నేడు జాతీయ లోక్‌అదాలత్

రామగిరి(నల్లగొండ): జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టుల సముదాయాల్లోని న్యాయ సేవాసదన్లలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు నల్లగొండ జిల్లా కోర్టు సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి డీవీఆర్ తేజోకార్తిక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.నాగరాజు జిల్లా కేంద్రంలోని కోర్టులో ఉదయం 10 గంటలకు జాతీయ లోక్ అదాలత్‌ను ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

16న సర్టిఫికెట్ల పరిశీలన

నల్లగొండ: విద్యా శాఖ పరిధిలోని నల్లగొండ అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో ప్రత్యేక అధికారి, సీఆర్‌టీ సైన్స్ పోస్టుకు దరఖాస్తు చేసుకున్న వారి సర్టిఫికెట్లను ఈ నెల 16న డీఈఓ కార్యాలయంలో పరిశీలించనున్నట్లు డీఈఓ భిక్షపతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1:3 పద్ధతిన సమగ్ర శిక్షా హైదరాబాద్ వారు విడుదల చేసిన జాబితాను డీఈఓ కార్యాలయ నోటీసు బోర్డుపై ఉంచినట్లు పేర్కొన్నారు. జాబితాలో ఉన్న అభ్యర్థులు ఉదయం 10 గంటలకు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు.

చెర్వుగట్టు ఆదాయం రూ.42.70 లక్షలు



హుండీలను లెక్కిస్తున్న సిబ్బంది

నార్కట్‌పల్లి: మండలంలోని చెర్వుగట్టు గ్రామంలోని శ్రీపార్వతి జడలరామలింగేశ్వర స్వామి దేవస్థానం హుండీలను శుక్రవారం లెక్కించారు. భక్తులు సమర్పించిన కానుకలు 50 రోజులకు గాను రూ.42,79,130 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి నవీన్‌కుమార్ తెలిపారు. ఇందులో అన్నదానం హుండీ ఆదాయం రూ.39,988 వచ్చినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకుడు రామలింగేశ్వర శర్మ, సీనియర్ అసిస్టెంట్లు ఇంద్రసేనారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, యాదయ్య, నర్సిరెడ్డి, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ల అసోసియేషన్ జిల్లా కమిటీ ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులు

నల్లగొండ రూరల్: తహసీల్దార్ల అసోసియేషన్ జిల్లా కమిటీని శుక్రవారం నల్లగొండలోని రెవెన్యూ భవన్‌లో ఏకగ్రీవంగా స్థానిక ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా పి.శ్రీనివాస్, తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సిరిగిరి కుమార్‌రెడ్డి, తహసీల్దార్ల అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా చండూరు తహసీల్దార్ దశరథ, రెవెన్యూ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా రామకృష్ణ, ఉపాధ్యక్షుడిగా జీవీఎస్ రామారావును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీని సన్మానించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బానాల రాంరెడ్డి, మహిళా కన్వీనర్ రాధ, కమిటీ సభ్యులు శ్రీరామ్, మల్లేష్ పాల్గొన్నారు.

ధాన్యం సేకరణలో జిల్లాది మొదటిస్థానం



చీమలగడ్డలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు

నకిరేకల్: ధాన్యం సేకరణలో రాష్ట్రంలోనే నల్లగొండ జిల్లా మొదటి స్థానంలో ఉందని జిల్లా పౌరసరఫరాల అధికారి (డీఎస్‌ఓ) వి.వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం సాయంత్రం ఆయన నకిరేకల్ శివారులోని చీమలగడ్డలో ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పక్కరాష్ట్రాల నుంచి ధాన్యం తీసుకొచ్చి విక్రయిస్తున్నారని రూమర్స్ వస్తున్నాయని.. అది అవాస్తవమన్నారు. జిల్లాలోని నాగార్జునసాగర్, వాడపల్లి వద్ద రెండు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు చేస్తున్నామన్నారు. ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి అవకతవకలు జరగడం లేదన్నారు. ఆయన వెంట పలువురు సిబ్బంది ఉన్నారు.



• సమ్మెలోనే సాపాటు

సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నల్లగొండ కలెక్టరేట్ ఎదుట జరుగుతున్న సమ్మె శుక్రవారానికి 4వ రోజుకు చేరింది. సమగ్ర శిక్షా ఉద్యోగులు నిరవధిక దీక్ష చేస్తున్నారు. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట భోజనం చేశారు.

- సాక్షి స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, నల్లగొండ

దొంగదారుల్లో ధాన్యం రాక

చెక్‌పోస్టులు లేని దారుల మీదుగా తెలంగాణలోకి ఆంధ్రా వడ్లు

- సన్నధాన్యం బోనస్ కోసం వ్యాపారుల తరలింపు
- ఇప్పటికే పెద్ద ఎత్తున ధాన్యం వచ్చినట్లు అంచనా
- మిర్యాలగూడ, హుజూర్‌నగర్ మిల్లుల్లో నిల్వలు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ఆంధ్రా నుంచి తెలంగాణలోకి సన్న ధాన్యం యథేచ్ఛగా తరలివస్తోంది. పక్క రాష్ట్రం నుంచి ధాన్యం రాకను నియంత్రించాల్సిన రెవెన్యూ, పోలీసు, పౌరసరఫరాల యంత్రాంగం నిర్లిప్తత కారణంగా వందలాదిగా ధాన్యం లారీలు సరిహద్దులు దాటి ఉమ్మడి నల్లగొండ జిల్లాలోకి వస్తున్నాయి. తెలంగాణలో సన్న ధాన్యం క్వింటాల్‌కు రూ.2320 మద్దతు ధరతోపాటు రూ.500 బోనస్ వస్తుండటంతో వ్యాపారులు ఆంధ్రప్రదేశ్‌లో రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసిన ధాన్యాన్ని పెద్ద ఎత్తున లారీల్లో తెలంగాణకు తరలించి ఇక్కడి రైతుల పేరుతో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. గురువారం తెలవారుజామున ధాన్యం తీసుకువస్తున్న లారీలను సూర్యాపేట జిల్లా మేళ్లచెరువులో పోలీసులు పట్టుకొని వెనక్కి పంపించి వేయడమే ఇందుకు ఉదాహరణ. అదే కాదు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో చెక్‌పోస్టులు లేని నాలుగైదు ఆంధ్రా సరిహద్దు ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ధాన్యాన్ని వ్యాపారులు తరలించి సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లోని మిల్లుల్లో డంప్ చేసినట్లు తెలుస్తోంది.



గురువారం తెలవారుజామున మేళ్లచెరువులో పోలీసులు అడ్డుకొని వెనక్కి పంపిన లారీలు

ఒక్క చెక్‌పోస్టు వద్దే 131 లారీలు అడ్డగింత

ప్రస్తుతం నాగార్జునసాగర్, వాడపల్లి, కోదాడ మండలం రామాపురం క్రాస్ రోడ్డు వద్ద అంతర్రాష్ట చెక్‌పోస్టులు ఉండగా, మేళ్లచెరువు మండలం రామాపురం వద్ద నెల రోజుల కిందటే చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. అర్ధరాత్రి వేళల్లో ఆయా చెక్‌పోస్టుల వద్ద అక్కడి సిబ్బందిని మేనేజ్ చేసి వ్యాపారులు ఆంధ్రా ధాన్యాన్ని తెలంగాణలోకి తరలించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఒక్క కోదాడ మండలం రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద నవంబరు 16న చెక్‌పోస్టును ఏర్పాటు చేసినప్పటి నుంచి ఇప్పటివరకు వచ్చిన 131 లారీలను అడ్డుకొని వెనక్కి పంపించారంటే, రాష్ట్రంలోకి ప్రవేశించినవి ఎన్ని ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.

అక్కడ చెక్‌పోస్టు పెట్టినా సిబ్బంది తక్కువే..

కోదాడ మండలం రామాపురం క్రాస్ రోడ్డు, నాగార్జునసాగర్, వాడపల్లి చెక్ పోస్టుల నుంచి ధాన్యం పెద్ద ఎత్తున తరలించే వీలు లేదు. అర్ధరాత్రి వేళల్లో అక్కడ డ్యూటీలో సిబ్బందిని మేనేజ్ చేసుకొని కొంతమేర తలిస్తున్నారు. ఇక సూర్యాపేట జిల్లాలోని మఠంపల్లి మండలం మట్టపల్లి వద్ద కృష్ణానదిపై ఉన్న బ్రిడ్జి మీదుగా లారీల్లోనూ ధాన్యం తరలిస్తున్నట్లు తెలిసింది. అక్కడ తక్కువ సంఖ్యలో ఉంటుండటంతో ఆ ప్రాంతం నుంచి ధాన్యం లారీలు మఠంపల్లి మండల కేంద్రం మీదుగా హుజూర్‌నగర్‌వైపు వస్తున్నాయి.

చెక్‌పోస్టులే లేని ఆ నాలుగు ప్రాంతాల నుంచి అధికంగా..

- ఆంధ్రా నుంచి తెలంగాణలోకి చెక్ పోస్టులు అసలే లేని నాలుగు ప్రాంతాలు సూర్యాపేట జిల్లాలోని కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో ఉన్నాయి. వాటి ద్వారానే పెద్ద ఎత్తున ధాన్యం లారీలను తీసుకువస్తున్నట్లు తెలుస్తోంది. ఏపీలోని ఎన్‌టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం బూదాడ మీదుగా సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండలం రామాపురం.. అక్కడి నుంచి మేళ్లచెరువుకు వస్తుండటంతో నెల రోజుల కిందట చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. అదికాకుండా ఎన్‌టీఆర్ జిల్లా జగ్గయ్యపేట నుంచి మక్త్యాల మీదుగా సూర్యాపేట జిల్లాలోని చింతలపాలెం మండలం దొండపాడు మీదుగా మేళ్లచెరువు మండలం రేవూరులో ప్రవేశించి మేళ్లచెరువు మీదుగా పెద్ద ఎత్తున ధాన్యం తరలిస్తున్నారు. ఎట్టకేలకు ఈ విషయాన్ని గుర్తించిన పోలీసులు గురువారం చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. మరోవైపు గుంటూరు జిల్లా అచ్చంపేట మండలం నుంచి పులిచింతల ప్రాజెక్టు బ్రిడ్జీ మీదుగా వస్తున్నాయి.
- జగ్గయ్యపేట నుంచి కోదాడ మండలంలోని అన్నారానికి, అక్కడి నుండి కోదాడ మండలంలోని రెడ్లకుంట, కాపుగల్లు, గుడిబండ మీదుగా కోదాడ బైపాస్ రోడ్డుకు ధాన్యం చేరుస్తున్నారు.
- మరికొంత మంది కృష్ణాజిల్లా గరికపాడు నుంచి తక్కెళ్లపాడు మీదుగా అనంతగిరి మండలంలోని గోండ్రియాల మీదుగా కోదాడకు, కోదాడ-ఖమ్మం రోడ్డుమీదుగా ఖమ్మంకు తరలిస్తున్నట్లు తెలుస్తోంది. పోలీసులు, అధికారులు కేవలం హైవే, చెక్‌పోస్టులు ఉన్న ఇతర ప్రాంతాల్లో చేస్తూ మిగతా ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలను పట్టించుకోకపోవడంతో పెద్ద ఎత్తున ధాన్యం జిల్లాలో డంప్ చేసినట్లు తెలిసింది.

ఇందిరమ్మ ఇళ్లకు పట్టా ఇక్కట్లు!

- సొంత స్థలాలు ఉన్నా డాక్యుమెంట్లు లేవంటున్న పేదలు
- యాప్‌లో అప్‌లోడ్ చేయని సర్వే సిబ్బంది
- గ్రామకంఠం భూములకు లేని పట్టాలు
- ఈ స్థలాలపై స్పష్టతనివ్వని యంత్రాంగం



నల్లగొండలోని ఓ వార్డులో సర్వే చేస్తున్న సిబ్బంది

నల్లగొండ టూటౌన్: ఇందిరమ్మ ఇళ్ల పథకానికి అర్హుల ఎంపిక కోసం సర్వే చేస్తున్న సిబ్బందికి క్షేత్రస్థాయిలో సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి. సర్వేపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం సొంతిల్లు లేని పేదలకు ఇందిరమ్మ పథకం కింద ఇంటి నిర్మాణానికి చేయూతనిస్తామని చెప్పి ప్రజాపాలనలో దరఖాస్తులు స్వీకరించింది. అయితే సొంత స్థలం ఉన్నవారు దానికి సంబంధించిన పట్టా డాక్యుమెంట్ చూపిస్తే దానిని సర్వే సిబ్బంది స్కాన్ చేసి యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. కానీ నీలగిరి, మిర్యాలగూడ, దేవరకొండ, హాలియా, చండూరు, చిట్యాల, నకిరేకల్ పట్టణాల్లో గ్రామ కంఠంలో సొంత స్థలమున్న పేదలకు డాక్యుమెంట్లు లేక నానా ఇక్కట్లు పడుతున్నారు. డాక్యుమెంట్లు ఉంటేనే అప్‌లోడు చేస్తామని సర్వే సిబ్బంది చెబుతుండడంతో గ్రామకంఠం భూములకు పట్టాలు లేవని ఇప్పుడెలా తెచ్చేదని దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫలితంగా సొంతింటి కల నెరవేరే అంశంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

డాక్యుమెంట్లు లేకపోవడంతో..

ఉదాహరణకు నీలగిరి పట్టణం మున్సిపాలిటీ ప్రాంతం అయినప్పటికి పట్టణ నడిబొడ్డుతో పాటు శివారు ప్రాంతాల్లో గ్రామ కంఠం స్థలాలు కూడా అధికంగానే ఉన్నాయి. ముఖ్యంగా నల్లగొండలో మర్రిగూడ, చర్లపల్లి, ఆర్జాలబావి, శేషమ్మగూడెం, ఎస్సీ కాలనీ, కేశరాజుపల్లి, పానగల్, గొల్లగూడ, అక్కలాయిగూడెం, గంధంవారిగూడెం, కతాల్‌గూడ, అర్బన్‌కాలనీ, లెప్రసీ కాలనీ, మామిళ్లగూడెం, పాత బస్తీ ప్రాంతం, మాన్యంచల్క, హైదర్‌ఖాన్‌గూడ తదితర ప్రాంతాల్లో గ్రామ కంఠం స్థలాలే ఎక్కువగా ఉన్నాయి. ఇలాంటి చోట్ల పేదలకు పట్టా డాక్యుమెంట్లు లేకపోవంతో వారు సర్వే అధికారులకు చూపలేని పరిస్థితి దాపురించింది. దాంతో సర్వే సిబ్బంది గ్రామ కంఠంలో స్థలం ఉండి పట్టా డాక్యుమెంట్ లేనివారి వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేయకుండా వదిలేస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై ఉన్నతాధికారులు స్పష్టత ఇస్తేనే యాప్‌లోడ్ చేయడానికి వీలు కలుగుతుందని సర్వే సిబ్బంది చెబుతున్నారు. ఇలాంటి వారికి ఎలా న్యాయం చేస్తారో ప్రభుత్వ నిర్ణయంపై ఆధారపడి ఉంది.

నీలగిరిలో 26,548 దరఖాస్తులు..

ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి మొదటి దశలో 3,500 నుంచి 4వేల వరకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. దీంట్లో భాగంగా ఇప్పటికే దరఖాస్తులు స్వీకరించగా ఒక్క నీలగిరి పట్టణంలోనే 26,548 మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఇంత వరకు బాగానే ఉన్నప్పటికీ సర్వేలో ఇచ్చిన ప్రశ్నలకు యాప్‌లో అప్‌లోడ్ చేయడానికి అడ్డంకులు వస్తున్నాయి. నీలగిరి పట్టణంలోని 48 వార్డుల్లో వార్డు ఆఫీసర్లు ఇందిరమ్మ ఇళ్ల పథకానికి అర్హులను ఎంపిక చేస్తున్నారు. అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలిస్తూ దరఖాస్తుదారుల వివరాలను ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. దరఖాస్తు చేసుకున్న వారు అద్దె ఇంటిలో ఉంటే అక్కడే ఇల్లు వచ్చే విధంగా ఫొటో తీసుకొని యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. సొంత స్థలం ఉంటే ఎక్కడ, ఏ కాలనీలో ఉందో అక్కడికి వెళ్లి ప్లాట్ దగ్గర నిలబెట్టి ఫొటో తీసుకొని అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. దీంతో చాలా సమయం పడుతుందని సర్వే సిబ్బంది చెబుతున్నారు. ఈ నెలాఖరులోగా సర్వే పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. కాగా మొదట సొంత స్థలాలు ఉన్న వారికే ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని ప్రభుత్వం చెబుతున్న విషయం తెలిసిందే. కాగా మున్సిపల్ అధికారులను సంప్రదించగా సోమవారం వరకు ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయి స్పష్టత రానున్నట్లు చెబుతున్నారు.

పెంచిన డైట్ చార్జీల వివరాలు ప్రదర్శించాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ: ప్రభుత్వం పెంచిన డైట్ చార్జీల వివరాలను అన్ని గురుకులాలు, సంక్షేమ హాస్టళ్ల ముందు అందరికీ కనిపించేలా ఫ్లెక్సీలు ప్రదర్శించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. పెంచిన డైట్ చార్జీల ప్రారంభ కార్యక్రమ ఏర్పాట్ల విషయమై సంబంధిత జిల్లా అధికారులు, మండలాల ప్రత్యేక అధికారులతో శుక్రవారం ఆమె టెలికాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. శనివారం నిర్వహించనున్న కొత్త డైట్ మెనూ ప్రారంభ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమానికి విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల అప్లికేషన్ల సర్వేపై కలెక్టర్ సమీక్షిస్తూ ఎలాంటి తప్పులు లేకుండా కొనసాగించాలన్నారు. ఈ నెల 15, 16 తేదీల్లో జరగనున్న గ్రూప్–2 పరీక్షలకు అన్ని ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, గృహ నిర్మాణ శాఖ పీడీ రాజకుమార్, సీపీఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డుల్లో వర్మి కంపోస్ట్ తయారు చేయాలి

నల్లగొండ టూటౌన్: డంపింగ్ యార్డుల్లో సాధ్యమైనంత ఎక్కువగా వర్మి కంపోస్ట్ తయారు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శుక్రవారం నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని డంపింగ్ యార్డును సందర్శించారు. తడి చెత్త, పొడి చెత్త, రీసైక్లింగ్ తయారీ విధానంపై కలెక్టర్ పలు సూచనలు చేశారు. యార్డు సమీపంలోనే ఉన్న స్థలంలో స్లాటర్ హౌస్ నిర్మాణం కోసం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. అనంతరం శేషమ్మగూడెంలో ఉన్న సీవరేజ్ ట్రీట్‌మెంట్‌ప్లాంట్ ను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీఓ అశోక్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, తహసీల్దార్ శ్రీనివాసులు పాల్గొన్నారు.



డంపింగ్ యార్డు పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

కనుల పండువగా ఊంజల్ సేవోత్సవం



అమ్మవారి ఊంజల్ సేవను ఊరేగిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో శుక్రవారం సంప్రదాయ పూజలు, ఆండాళ్ అమ్మవారి ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా కొనసాగాయి. వేకువజామున సుప్రభాతంతో నిత్య పూజలు ప్రారంభించిన అర్చకులు.. గర్భాలయంలోని స్వయంభూలను వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ పంచామృతాలతో అభిషేకం, అర్చనలు చేశారు. అనంతరం ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం, నిత్యతిరుకల్యాణోత్సవ పర్వాలను శాస్త్రోక్తంగా చేపట్టారు. సాయంత్రం వేళ ప్రధానాలయంలో కొలువుదీరిన ఆండాళ్ అమ్మవారి ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా సాగింది. ఆండాళ్ అమ్మవారిని పట్టువస్త్రాలు, బంగారు, ముత్యాలు, వజ్రాభరణాలతో దివ్య మనోహరంగా అలంకరించి ఊంజల్ సేవను ఆలయ తిరువీధుల్లో ఊరేగించారు.

విద్యుత్ ప్రైవేటీకరణను వ్యతిరేకించాలి



నల్లగొండలో ప్రైవేటీకరణ వ్యతిరేక దినోత్సవంలో పాల్గొన్న విద్యుత్ ఉద్యోగులు

నల్లగొండ: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విద్యుత్ ప్రైవేటీకరణ విధానాలను విద్యుత్ ఉద్యోగులంతా వ్యతిరేకించాలని విద్యుత్ ఉద్యోగుల యూనియన్ జిల్లా జాక్ చైర్మన్ ఎన్.వెంకటయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం 1104 యూనియన్ ఆధ్వర్యంలో నల్లగొండలోని ట్రాన్స్‌కో ఎస్‌ఈ కార్యాలయంలో వద్ద ప్రైవేటీకరణ వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. విద్యుత్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ.. ఫ్లెక్సీ ప్రదర్శనతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయనతోపాటు 1104 యూనియన్ నాయకులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ డీఈ నవీద్ అహ్మద్, శంకర్, వి.రవికుమార్, పి.రాంబాబు, విశ్వం, గంజి వెంకన్న పాల్గొన్నారు.

గ్రూప్-2 పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

- ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ క్రైం: గ్రూప్–2 పరీక్షలు ఈ నెల 15, 16 తేదీల్లో నిర్వహించనున్న నేపథ్యంలో పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు ఎస్పీ శరత్ చంద్ర పవార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని 59, మిర్యాలగూడలో 28 కేంద్రాల్లో 29,118 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరవుతున్నారని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 8 గంటల వరకు 144 సెక్షన అమల్లో ఉంటుందని పేర్కొన్నారు. కేంద్రాల సమీపంలో జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని, అభ్యర్థులు హాల్ టికెట్‌లో ఉన్న సూచనలు పాటించాలని కోరారు.

హాస్టల్ విద్యార్థులకు కొత్త డైట్

నేడు పండుగ వాతావరణంలో భోజన మెనూ ప్రారంభం

- తల్లిదండ్రులు, విద్యార్థులతో సమావేశాలు
- కార్యక్రమం నిర్వహణకు ప్రత్యేకాధికారుల నియామకం
- సిద్ధమైన గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లు

నల్లగొండ: జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల పాఠశాలలతో పాటు ఆయా వర్గాల సంక్షేమ హాస్టళ్లలో శనివారం నుంచి కొత్త డైట్ మెనూ అమలు కానుంది. ప్రభుత్వం గురుకులాలు, సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులకు ఇటీవల డైట్ చార్జీలు పెంచింది. దీంతో కొత్త డైట్ అమలును పండుగ వాతావరణంలో ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంట్లో భాగంగా అన్ని గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో కొత్త డైట్ మెనూ ప్రారంభించడానికి యంత్రాంగం సిద్ధమైంది.

నేడు అన్ని హాస్టళ్లలో..

జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకుల పాఠశాలలతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ హాస్టళ్లలో పండుగ వాతావరణంలో కొత్త డైట్ మెనూను పండుగ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. దీంట్లో భాగంగా ఇప్పటికే ప్రత్యేక అధికారులను నియమించి అన్ని హాస్టళ్లలో డైట్ చార్జీల పెంపు బోర్డులు, తోరణాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో ప్రారంభించిన అనంతరం తల్లిదండ్రులతో సమావేశం కానున్నారు. ఈ పండుగ సందర్భంగా విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు చికెన్ బిర్యానీతో పాటు మిల్ మేకర్ కుర్మా పెట్టాలని నిర్ణయించారు. రాష్ట్ర, జిల్లాస్థాయి అధికారులను ఈ హాస్టళ్లను సందర్శించి కార్యక్రమాన్ని పర్యవేక్షించనున్నారు.

40 శాతం డైట్ చార్జీలు పెంపు

జిల్లాలో 204 గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లు ఉన్నాయి. వీటిల్లో ఉన్న విద్యార్థులకు తరగతులను బట్టి డైట్ చార్జీలు పెరిగాయి. ఏడేళ్ల నుంచి డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచలేదు. అయితే ప్రస్తుతం పరిస్థితుల్లో నిత్యావసర వస్తువులు, కాస్మోటిక్ ధరలు భారీగా పెరిగాయి. పాత రేట్లతో విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించలేని పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితిని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు మంచి భోజనం అందించాలన్న ఉద్దేశంతో 40 శాతం డైట్ చార్జీలను పెంచింది.





డైట్ చార్జీలు ఇలా (రూపాయలలో..)

తరగతి	ప్రస్తుత చార్జీలు	పెంచినవి చార్జీలు
3నుంచి 7 వరకు	950	1,330
8నుంచి 10వరకు	1,100	1,540
ఇంటర్ నుంచి పీజీ	1,500	2,100
కాస్మోటిక్ చార్జీలు (బాలికలకు)		
3 నుంచి 7వరకు	55	175
8 నుంచి 10 వరకు	75	275
కాస్మోటిక్ చార్జీలు (బాలురుకు)		
3 నుంచి 7 వరకు	62	150
8 నుంచి 10 వరకు	62	200

మెనూ వివరాలు ఇలా..

వారం	ఉదయం	మధ్యాహ్నం	రాత్రి
సోమ	పులిహోర, సాంబార్, అరటిపండు	రైస్ పాలకూర పప్పు	రైస్, వెజిటబుల్ కర్రీ, సాంబారు, మజ్జిగ గుడ్డు
మంగళ	కిచిడి, సాంబార్, అరటి పండు	రైస్ పాలకూర పప్పు	రైస్, వెజిటబుల్ కర్రీ, సాంబారు, మజ్జిగ, గుడ్డు
బుధ	టమాట రైస్, సాంబారు	రైస్, వెజిటబుల్ కర్రీ	రైస్, చికెన్ కర్రీ, బట్టర్‌మిల్క్, సాంబారు
గురు	పులిహోర, సాంబారు, అరటిపండు	రైస్, పాలకూర పప్పు	రైస్, వెజిటబుల్ కర్రీ, సాంబారు, మజ్జిగ, గుడ్డు
శుక్ర	కిచిడీ, సాంబారు	రైస్, పాలకూర పప్పు	రైస్, వెజిటబుల్ కర్రీ, సాంబారు, మజ్జిగ, గుడ్డు
శని	జీరా రైస్, సాంబార్	రైస్, వెజిటబుల్ కర్రీ	రైస్, పాలకూర పప్పు, అరటిపండు, మజ్జిగ, సాంబారు
ఆది	ఉప్మా, సాంబారు	రైస్, వెజిటబుల్ కర్రీ	బగారా రైస్, చికెన్ కర్రీ, మజ్జిగ, సాంబారు

విద్యతోనే ఉన్నత స్థాయికి చేరుకోగలం

- హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ

యాదగిరిగుట్ట రూరల్: విద్యార్థులు విద్యతోనే ఉన్నత స్థాయికి చేరుకుంటారని, చదువుతో ఏదైనా సాధించవచ్చని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. యాదగిరిగుట్ట మండలంలోని కాచారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు ఆత్మ విశ్వాసంతో ఉండాలని, ధైర్యంగా ముందుకెళ్లినప్పుడు అనుకున్నది సాధించగలమన్నారు. పేదరికం పోవా లన్నా, నిరుద్యోగం నిర్మూలన కావాలన్నా, దేశం అభివృద్ధి చెందాలన్నా, విద్యతోనే సాధ్యమన్నారు. విద్యార్థులు ఆటలపై కూడా దృష్టి పెట్టాలన్నారు. ఇతరులకు సహాయం చేసే గుణాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. విద్యారంగంలో ఆడపిల్లలు ముందు వరుసలో కొనసాగుతున్నారని కొనియాడారు. చదువుతో పాటు సామాజిక స్పృహ ఉంది కాబట్టి మంత్రి, గవర్నర్ కూడా అయ్యాయని విద్యార్థులకు తెలిపారు. యువత డ్రగ్స్ వైపు కన్నెత్తి చూడకూడదని సూచించారు.

విద్యార్థులతో ముచ్చట్లు

పాఠశాలలోని విద్యార్థులతో గవర్నర్ దత్తాత్రేయ కాసేపు సరదాగా మాట్లాడారు.. రోజువారీ దినచర్య ఏంటి, ఎన్ని గంటలకు నిద్ర లేస్తారు, వ్యాయామం చేస్తారా, భవిష్యత్‌లో ఏం అవుతారు అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ పాఠశాలకు సైన్స్‌ల్యాబ్ కావాలని గవర్నర్‌ను కోరగా.. బీడీ ఫౌండేషన్ తరఫున సైన్స్‌ల్యాబ్, కంప్యూటర్లు అందజేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం విద్యార్థులకు వడ్డె మహదేవ్ ఫౌండేషన్ సహకారంతో స్టడీ మెటీరియల్ అందజేశారు. అంతకుముందు విద్యార్థినులు చేసిన కరాటే ప్రదర్శన తిలకించి వారిని అభినందించారు. కార్యక్రమంలో ఆర్డీఓ కృష్ణారెడ్డి, డీఈఓ సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి, తహసీల్దార్ దేశ్యా నాయక్, వడ్డె మహదేవ్ ఫౌండేషన్ చైర్మన్ వడ్డె ఉపేందర్, బీజేపీ రాష్ట్ర నాయకుడు గూడూరు నారాయణరెడ్డి, మాజీ జెడ్పీటీసీ తోటకూరి అనురాధ, మాజీ సర్పంచ్ కలకుంట్ల సరిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



కాచారం గ్రామంలో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ



తులాభారం వేసుకుంటున్న దత్తాత్రేయ

స్వర్ణగిరి క్షేత్రాన్ని సందర్శించిన దత్తాత్రేయ

భువనగిరి : పట్టణ శివారులోని స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని శుక్రవారం హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో దత్తాత్రేయ ప్రత్యేక పూజలు నిర్వహించి, తులభారం వేసుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు ఆయనకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా గవర్నర్‌ను ఆలయ వ్యవస్థాక చైర్మన్ మానేపల్లి రామారావు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గూడూరు నారాయణరెడ్డి, వేముల అశోక్, చందా మహేందర్ గుప్తా, రత్నపురం బలరాం, సురేష్‌రెడ్డి, అనిల్, వినోద్‌కుమార్ ఉన్నారు.

క్లుప్తంగా

డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న డీఎస్పీ, సీఐలు

మిర్యాలగూడ అర్బన్: నార్కోటిక్‌లో ప్రత్యేక శిక్షణ పొందిన డాగ్ స్క్వాడ్‌తో శుక్రవారం రాత్రి మిర్యాలగూడ పట్టణంలో పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. డీఎస్పీ కె.రాజశేఖరరాజు ఆధ్వర్యంలో వన్‌టౌన్, టూటౌన్, రూరల్ సీఐలు నాగార్జున, కరుణాకర్, వీరబాబులు డాగ్ స్క్వాడ్‌తో పట్టణంలోని ఆర్‌టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్, సుందర్‌నగర్, గాంధీనగర్‌లలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాలు గుర్తించడానికి ప్రత్యేకంగా శిక్షణ పొందిన డాగ్ స్క్వాడ్‌ను నల్లగొండ నుంచి తెప్పించామని, మాదక ద్రవ్యాలను అరికట్టడానికి తనిఖీలు చేస్తున్నామని తెలిపారు.

కుక్కల దాడిలో వానరం మృతి

చిట్యాల: పట్టణంలోని ఇందిరా నగర్‌లో కుక్కలు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిన ఓ వానరం శుక్రవారం మృతి చెందింది. వివరాలు.. ఇందిరానగర్‌లో వీధి కుక్కల దాడిలో ఓ వానరం తీవ్రంగా గాయపడింది. దీంతో పశువైద్యాధికారి అభినవ్‌కు గ్రామస్తులు పాల శంకర్, కూరెళ్ల లింగస్వామి సమాచారం ఇచ్చారు. ఆయన సూచన మేరకు గోపాల మిత్ర రెముడాల ఆనంద్.. గాయపడిన వానరానికి వైద్య చికిత్స అందించినప్పటికీ మృతి చెందింది. మృతి చెందిన వానరానికి మున్సిపల్ కార్మికులు పెద్ద నర్సింహ, ప్రణీత్, శేఖర్, శంకర్, అంత్యక్రియలు నిర్వహించారు.

షార్ట్‌సర్క్యూట్‌తో టీవీ దగ్ధం

ఆత్మకూర్(ఎస్)(సూర్యాపేట) : ఆత్మకూర్ (ఎస్) మండల పరిధిలోని నిమ్మికల్ గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గంగరబోయిన గురుస్వామి ఇంట్లో టీవీ దగ్ధమైన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గురుస్వామి ఇంటి బయట విద్యుత్ సర్వీస్ వైర్‌పై కోతులు దూకడంతో ఒకసారిగా మంటలు చెలరేగి ఇంట్లో టీవీ పేలిపోవడంతో పలు వస్తువులు చెల్లాచెదురుగా పడి మంటలు అలుముకున్నాయి. గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు మంటలు ఆర్పడంతో పెను ప్రమాదం తప్పింది.

నిప్పురవ్వలు పడి ఇద్దరికి గాయాలు

నేరేడుచర్ల : నిప్పురవ్వలు పడి ఇద్దరికి గాయాలైన సంఘటన శుక్రవారం నేరేడుచర్ల పట్టణంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని జాన్‌పహాడ్ రోడ్డులో గల ఓ పారాబాయిల్డ్ మిల్లులో వెల్డింగ్ చేస్తుండగా నిప్పురవ్వలు పడి గోపి చందర్, నాగులుమీరాకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని హుజూర్‌నగర్ ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం సూర్యాపేట ఆస్పత్రికి తరలించారు.

ఉత్తమ రైతు అవార్డుకు ఎంపిక

త్రిపురారం : మండలంలోని కంపాసాగర్ గ్రామ పంచాయతీ పరిధిలో గల కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) శాస్త్రవేత్తల సలహాలు సూచనలు మేరకు ప్రకృతి, సేంద్రియ వ్యవసాయంలో వివిధ పంటలు సాగు చేస్తూ నికరంగా ఆదాయం సాధించిన రైతులను ఉత్తమ అవార్డుకు ఎంపిక చేసినట్లు కృషి విజ్ఞాన కేంద్రం కంపాసాగర్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. తిరుమలగిరి సాగర్ మండలంలోని ఎర్ర చెరువు తండాకు చెందిన బాలకృష్ణ అవార్డుకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం 60 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం పాలెంలో నిర్వహించిన వజ్రోత్సవ కార్యక్రమంలో ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి ఉత్తమ రైతులకు అవార్డులు అందించినట్లు తెలిపారు.

మట్టిని తరలిస్తే చర్యలు తప్పవు

వలిగొండ : మండలంలోని రెడ్లరేపాక గ్రామ పరిధిలో గతంతో అక్రమంగా తరలిస్తున్న సుమారు 800ట్రాక్టర్ల మట్టిని రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. ఈ నేపథ్యంలో కొంతమంది అక్రమార్కులు సీజ్ చేసిన మట్టిని తరలించేందుకు ప్రయత్నిస్తున్నారనే సమాచారాన్ని తహసీల్దార్‌కు చేరవేశారు. దీంతో ఆయన గురువారం రాత్రి మట్టిని సీజ్ చేసిన ప్రాంతానికి రెవెన్యూ సిబ్బందిని పంపించి మట్టిని తరలించకుండా కాపలా ఉంచామన్నారు. సీజ్ చేసిన మట్టిని ఎవరైనా తరలిస్తే క్రిమినల్ చర్యలు తప్పవని హెచ్చరించారు. గతంలో సీజ్ చేసిన మట్టిని మైనింగ్ శాఖ ఏడీ ఆధ్వర్యంలో త్వరలో వేలం వేయనున్నట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో యువ రైతు మృతి



ప్రభాకర్‌రెడ్డి (ఫైల్)

హాలియా: విద్యుదాఘాతంతో యువరైతు మృతి చెందాడు. అనుముల మండలం రామడుగు గ్రామానికి చెందిన నిమ్మల ప్రభాకర్‌రెడ్డి(23) తన తండ్రి శ్రీనివాస్‌రెడ్డికి వ్యవసాయ పనుల్లో చేదోడువాదోడుగా ఉంటున్నాడు. ఈ క్రమంలో తన తండ్రితో కలిసి ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం ఉదయం తమ వ్యవసాయ పొలం వద్దకు వెళ్లాడు. పొలంలోని ఒడ్డుపై సుబాబుల్ చెట్లను తండ్రి శ్రీనివాస్‌రెడ్డి గొడ్డలితో నరికి వేస్తుండగా ప్రభాకర్‌రెడ్డి వాటిని తొలగించే క్రమంలో పైన ఉన్న 11కేవీ విద్యుత్ తీగలను చెట్టుకొమ్మలు తాకడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తండ్రి శ్రీనివాస్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సతీష్‌రెడ్డి తెలిపారు.

మహిళ అదృశ్యం.. కేసు నమోదు



ఉడుత రేవంతి

భువనగిరి టౌన్ : ఆస్పత్రిలో వైద్యపరీక్షల కోసం వెళ్లిన ఓ మహిళ అదృశ్యమైంది. ఈ ఘటన భువనగిరి మండలంలోని బస్వాపురం గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బస్వాపురం గ్రామానికి చెందిన ఉడుత రేవంతిని శుక్రవారం ఉదయం పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో వైద్యం పరీక్షల నిమిత్తం ఆమె భర్త సాయికుమార్ ఆటోలో తీసుకొచ్చి వదిలివెళ్లాడు. దీంతో రేవంతి మధ్యాహ్నం 2గంటలైనా ఇంటికి రాకపోవడంతో సాయికుమార్ పట్టణంలోనే ఆర్‌బీనగర్‌లో రేవంతి అమ్మగారి ఇంటికి వెళ్లి భార్య కోసం అడిగారు. ఆమె తమ ఇంటికి రాలేదని తల్లిదండ్రులు చెప్పడంతో బంధుమిత్రులకు ఫోన్‌చేసి అడిగినా ఆచూకీ లభించలేదు. దీంతో చేసేది లేక పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

మొగిలిపాకలో యువతి..

వలిగొండ : మండలంలోని మొగిలిపాకలో ఓ యువతి అదృశ్యమైన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన భీమనబోయిన మానస (20) గురువారం సాయంత్రం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లి రాత్రి వరకు తిరిగిరాలేదు. దీంతో యువతి కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, బంధువుల ఇళ్లల్లో ఎక్కడా వెతికిన ఆచూకీ లభించలేదు. దీంతో కుటుంబ సభ్యులు శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ యుగంధర్ తెలిపారు.

పరిశోధనలో గణాంకాలు కీలకం

నల్లగొండ రూరల్: శాస్త్రీయ పరిశోధనలో గణాంకాలు కీలకమని రీసెర్చ్ మెథడాలజీ శిక్షణలో పాల్గొన్న వక్తలు షమీం, శ్వేత అన్నారు. గణాంకాలతో శాస్త్రీయంగా సామాజికంగా, రాజకీయ, ఆర్థిక విశ్లేషణ అనే అంశంపై శుక్రవారం ఎంజీ యూనివర్సిటీలో పది రోజుల పాటు నిర్వహించే శిక్షణలో వారు పాల్గొని మాట్లాడారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ ప్రజంటేషన్‌లో గణాంకాల పాత్ర ప్రతి పరిశోధనలో మిళితమై ఉందన్నారు. విస్తృత సమాచారాన్ని గణాంకాల రూపంలో ప్రజల ముందు ఉంచాల్సి ఉందన్నారు. ప్రజల ఆర్థిక, జీవన స్థితిగతులు తెలియజేయడంలో గణితం పాత్ర విడదీయలేనిదన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా అధ్యాపకులు, విద్యార్థులు మరిన్ని పరిశోధనలు చేయాల్సి ఉందని సూచించారు.

భవనం పైనుంచి పడి వ్యక్తి దుర్మరణం

మిర్యాలగూడ టౌన్ : ప్రమాదవశాత్తు భవనం పైనుంచి పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలం ఉట్లపల్లి గ్రామానికి చెందిన సలీం(37) బతుకుదెరువు కోసం రంగారెడ్డి జిల్లా కొండాపూర్‌లో నివాసం ఉంటూ భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. సలీం రోజు మాదిరిగానే పనికి వెళ్లాడు. ఈ క్రమంలో మూడో అంతస్తు పరంజిపై నిలబడి పనిచేస్తుండగా.. పరంజి కర్ర విరిగి కిందపడిపోవడంతో తీవ్ర గాయాలపాలై మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మాజీ ఎంపీపీ ఆత్మహత్యాయత్నం

- రియల్ ఎస్టేట్ వ్యాపారం మందగించడంతో ఆర్థిక ఇబ్బందులు

గుర్రంపోడు : నల్లగొండ జిల్లా గుర్రంపోడు మాజీ ఎంపీపీ, జిల్లా కాంగ్రెస్ నాయకుడు మంచికంటి వెంకటేశ్వర్లు గురువారం రాత్రి నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండమల్లేపల్లిలోని తన ఇంట్లో గురువారం రాత్రి నిద్రించిన ఆయన శుక్రవారం ఉదయం నిద్రలేకపోవడాన్ని గమనించిన కుటుంబ సభ్యులు గది తలుపులు పగులగొట్టి లోపలకు ప్రవేశించి చూడగా అపస్మారక స్థితిలో కనిపించాడు. వెంటనే హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించారు. గదిలో నిద్ర మాత్రల ఖాళీ షీట్లు ఉండటాన్ని బట్టి నిద్రమాత్రలు మిగించినట్లు నిర్ధారించారు. సుమారు 50 మాత్రల వరకు మింగినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం నడవకపోవడం కారణంగా ఆర్థికఇబ్బందులతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్టు భావిస్తున్నారు. ఆయన ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నారు.

వ్యాపార భాగస్వామి ఒత్తిడే కారణమని లేఖ రాసి..

వెంకటేశ్వర్లు తాను నిద్రమాత్రలు మింగే ముందు ఒక లేఖ రాసిపెట్టినట్లు తెలిసింది. రియల్ ఎస్టేట్ వ్యాపారంలో తాను కొనుగోలు చేసి భూమి అమ్ముడుపోకపోవడం, వ్యాపార భాగస్వామి తను ఇచ్చిన డబ్బులకు వడ్డీ చెల్లించాలని ఒత్తిడి తెస్తుండటంతో ఆత్మహత్యకు పాల్పడాల్సి వచ్చిందని లేఖలో పేర్కొన్నట్లు తెలిసింది. గుర్రంపోడు మండలంలోని పాల్వాయిలో కొనుగోలు చేసిన ఆరు ఎకరాల భూమి రూ.కోటిన్నరకు రెండేళ్ల క్రితం కొనుగోలు చేయగా.. సగం వాటా డబ్బులు కూడా ఆ వ్యాపారి వడ్డీగా ఇవ్వడం, వడ్డీనే ఇప్పటికే రూ.40లక్షలు కావడం, వడ్డీ చెల్లించాలనే ఒత్తిడే ఆత్మహత్యకు కారణంగా చెబుతున్నారు.

రియల్ ఎస్టేట్ మందగమనంతో ప్రాణాల మీదకు

వెంకటేశ్వర్లు 20ఏళ్లుగా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. వివిధ పార్టీల్లో పనిచేశారు. టీడీపీ హయాంలో మండల అధ్యక్షుడిగా, ఆ తర్వాత పాల్వాయి గ్రామ సర్పంచ్‌గా పనిచేశారు. టీఆర్ఎస్ హయాంలో ఎంపీపీగా కొనసాగారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరారు.

మానవ సంబంధాలతోనే మార్పు సాధ్యం

- ప్రముఖ రచయిత, విరసం నేత అల్లం రాజయ్య



మాట్లాడుతున్న అల్లం రాజయ్య

మిర్యాలగూడ టౌన్ : మానవ సంబంధాలతోనే మార్పు సాధ్యమవుతుందని ప్రముఖ రచయిత, విరసం నేత అల్లం రాజయ్య అన్నారు. శుక్రవారం పట్టణంలోని లోటస్ స్కూల్‌లో అల్లం కిరణ్ మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు కేతసపల్లి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆర్గానిక్ కెమిస్ట్రీ పీహెచ్‌డీ విద్యార్థి అల్లం కిరణ్ 17వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రాజయ్య మాట్లాడారు. «రక్త ప్రసరణ–రసాయనాల ప్రభావం» అనే అంశంపై అమెరికా లూసియానా తెలుగు యూనివర్సిటీలో శాస్త్ర పరిశోధన చేస్తూ 2007 డిసెంబర్ 13న అమెరికాలో అగంతుకులు జరిపిన దాడిలో కిరణ్ మృతి చెందాడని గుర్తుచేశారు. గ్రామాల్లో ఉత్పత్తి విధానం, సామాజిక కుటుంబాలు, ఆర్థిక విధానంపై లోతుగా అధ్యయనం చేశాడని, కిరణ్ సైన్స్‌కే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చాడన్నారు. అదే విధంగా తెలంగాణ మాజీ ప్రెస్ అకాడమి చైర్మన్ అల్లం నారాయణ మాట్లాడారు. అల్లం కిరణ్ ఆశయం ఎంతో గొప్పదని, ఆపరేషన్ లేకుండానే బ్రెయిన్ ట్యూమర్‌కు ఔషధాన్ని కనుగోనేందుకు అమెరికాకు వెళ్లారన్నారు. నేటి యువ శాస్త్రవేత్తలు కిరణ్‌ను ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాలన్నారు. అనంతరం కిరణ్ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన వివిధ క్రీడల్లో ప్రతిభ కనబర్చిన విజేతలకు వారు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అంబటి నాగయ్య, తెలంగాణ మట్టిమనిషి వేనేపల్లి పాండురంగారావు, కృష్ణమూర్తి, సమూహ రైటర్స్ ఫోరం నాయకులు కస్తూరి ప్రభాకర్, కవి మోహర రుషి, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు కుందూరు శ్యాంసుందర్‌రెడ్డి, ఉదయ, కొండల్‌రెడ్డి, కందుకూరి సుదర్శన్, పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

నిందితుల రిమాండ్



మఠంపల్లి : వివరాలు వెల్లడిస్తున్న సీఐ

మఠంపల్లి: మండలంలోని భీమ్లా తండాలో హత్య కేసులో నిందితులకు కోర్టు రిమాండ్ విధించింది. హుజూర్‌నగర్ సీఐ చరమంద రాజు తెలిపిన వివరాల ప్రకారం.. మఠంపల్లి మండలంలోని భీమ్లా తండాలో ఈ నెల 5న పానుగోతు పాచ్యానాయక్ హత్య జరిగింది. ఈ కేసులో అదే గ్రామానికి చెందిన పానుగోతు కొండానాయక్, పానుగోతు శోభన్, పానుగోతు కోటయ్య, పానుగోతు కోట్యాలను శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేసి కోర్టుకు తరలించారు. పాత కక్షలు మనసులో పెట్టుకుని నిందితులు కొండానాయక్, శోభన్ కలిసి మఠంపల్లి మండలంలోని సుల్తాన్‌పూర్‌తండా సమీపంలో పాచ్యానాయక్‌ను ఇనుపరాడ్, కత్తి, రాళ్లతో కొట్టి చంపారు. అదేవిధంగా ఈ హత్యకు కుట్ర చేసిన కోటయ్య, కోట్యాలను కూడా రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

హత్యాయత్నం కేసులో యువకుడు..

భూదాన్‌పోచంపల్లి : మున్సిపల్ కేంద్రంలోని వెంకటరమణ కాలనీకి చెందిన కొంక సాయికృష్ణపై దాడిచేసి గాయపర్చిన యువకుడు వంగ అనిల్‌ను శుక్రవారం అరెస్ట్ చేసి చౌటుప్పల్ కోర్టులో రిమాండ్ చేసినట్లు ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. వివరాలు.. ఈ నెల 11న సాయికృష్ణ.. వంగ అనిల్ మధ్య గొడవ జరిగింది. దీంతో కక్ష పెంచుకున్న అనిల్ అదేరోజు సాయంత్రం తన ఇంటి ముందు నుంచి వెళ్తున్న సాయికృష్ణను పొడిచి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. బాధితుడి తండ్రి లక్ష్మీనారాయణ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు. శుక్రవారం నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్ చేశామని పేర్కొన్నారు.

మామపై దాడి కేసులో కోడలికి..

వేములపల్లి : వృద్ధుడు, దివ్యాంగుడైన మామపై కోడలు చెప్పుతో దాడి చేసిన సంఘటనలో కోడలు మణిమాలను రిమాండ్‌కు తరలించినట్లు శుక్రవారం ఎస్‌ఐ డి.వెంకటేశ్వర్లు తెలిపారు. వివరాలు.. గత నెల 20న భూ వివాదంలో శెట్టిపాలెం గ్రామానికి చెందిన గగినపల్లి బుచ్చిరెడ్డిపై అతడి కోడలు మణిమాల చెప్పుతో దాడి చేసింది. ఆ వీడియో సామాజిక మాధ్యమంలో వైరల్‌గా మారింది. స్పందించిన పోలీసులు విచారణ చేపట్టి మణిమాలను అదుపులోకి తీసుకుని రిమాండ్ చేసినట్లు తెలిపారు.

క్రిస్మస్ కానుకలు లేనట్టే!

- గత సంప్రదాయానికి స్వస్తి
- విందు భోజనాలు ఏర్పాటు చేయాలని నిర్ణయం
- భువనగిరి జిల్లాకు రూ.4 లక్షలు విడుదల



గతంలో వచ్చిన క్రిస్మస్ కానుకలు (ఫైల్)

భువనగిరి టౌన్ : పేద ప్రజలు సంతోషంగా పండుగలు జరుపుకోవడానికి ప్రతిఏటా బీఆర్ఎస్ ప్రభుత్వం కానుకలు అందజేసేది. ఇందులో భాగంగా మహిళలకు బతుకమ్మ చీరలు, ముస్లింలకు రంజాన్‌తోఫా, క్రైస్తవులకు క్రిస్మస్ గిఫ్టులను అప్పటి ప్రభుత్వం ఏటా పంపిణీ చేస్తూ వచ్చింది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత బతుకమ్మ చీరలు, రంజాన్ తోఫాలు బంద్ చేస్తూ రావడంతోపాటు తాజాగా ఈ ఏడాది క్రిస్మస్ పండుగకు కానుకల పంపిణీ నిలిపివేసింది. పేద క్రైస్తవులకు గిఫ్ట్ ప్యాక్‌లను భువనగిరి జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి వెయ్యి చొప్పున గత ప్రభుత్వం మంజూరు చేసేది. వీటిని మండలాల వారీగా అధికారులతో ఏర్పాటు చేసిన క్రిస్మస్ సెలబ్రేషన్స్‌ఆర్గనైజేషన్ కమిటీ ఆధ్వర్యంలో చర్చిల నిర్వాహకులు గుర్తించిన పేదలకు పంపిణీ చేసేవారు. కానీ ప్రస్తుతం వాటిని బంద్ చేయడంతో నిరుపేద క్రిస్టియన్లు తీవ్ర అవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రతి సంవత్సరం జిల్లాకు రెండు వేల గిఫ్టులు

భువనగిరి జిల్లాలోని భువనగిరి, ఆలేరు నియోజకవర్గాలకు ప్రతి సంవత్సరం డిసెంబర్ 15వ తేదీన క్రిస్మస్ గిఫ్టులు పంపిణీ చేయాల్సి ఉంది. ప్రతి సంవత్సరం జిల్లాకు రెండు వేల గిఫ్టులు వచ్చేవి. క్రిస్మస్ విందు కూడా ఇచ్చేవారు. కానీ ఈ సంవత్సరం నేటివరకు ప్రభుత్వం అందజేసే చొరవ చూపలేదు. ప్రతి సంవత్సరం పేద క్రైస్తవులకు అందజేసే గిఫ్ట్ ప్యాకుల్లో ఒక చీర, పంజాబీ డ్రెస్, ప్యాంట్, షర్టు ఉండేవి. కుటుంబంలోని తల్లిదండ్రులకు, కుమారైకు ఈ దుస్తులు ఇచ్చేవారు. క్రిస్మస్ పండుగ రోజు కొత్త దుస్తులు కొనుక్కోలేని నిరుపేదలకు ఈ కానుక వరంగా ఉండేది. ఈ గిఫ్టులను ఆయా నియోజకవర్గంలోని ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, వార్డు సభ్యుల చేతుల మీదుగా పంపిణీ చేసేవారు. అయితే ఈ సంవత్సరం కిస్మస్ విందు కోసం నియోజకవర్గానికి రెండు లక్షల రూపాయల చొప్పున మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

దంపతుల హత్య కేసును ఛేదించిన పోలీసులు

- ఎనిమిది మంది అరెస్ట్
- నిందితుల్లో సూర్యాపేట జిల్లా వారు
- వివరాలు వెల్లడించిన ఖమ్మం పోలీసు కమిషనర్ సునీల్‌దత్

ఖమ్మం క్రైం: ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలో గత నెల 26వ తేదీన వృద్ధ దంపతులు ఎర్ర వెంకటరమణ, కృష్ణకుమారిని హత్య చేసిన నిందితులను ఖమ్మం పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల్లో సూర్యాపేట జిల్లాకు చెందిన వారు కూడా ఉన్నారు. కేసు వివరాలను ఖమ్మం పోలీసు కమిషనర్ సునీల్ దత్ శుక్రవారం వెల్లడించారు. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం ముగులూరుకు చెందిన షేక్ అబీద్ అలియాస్ అబియాద్ అలీ 2011 సంవత్సరంలో ఒకరిని హత్య చేసి బంగారం, డబ్బు ఎత్తుకెళ్లాడు. ఈకేసులో రాజమండ్రి సెంట్రల్ జైలులో శిక్ష అభవిస్తూ పెరోల్‌పై బయటకు వచ్చాడు. అనంతరం సూర్యాపేట జిల్లా కోదాడలో గది అద్దెకు తీసుకుని సోహైల్‌గా పేరు మార్చుకుని అప్పుడప్పుడు కూలి పనులకు వెళ్తుండేవాడు. ఆయన ఇంటి ఎదురుగా ఉన్న భర్త లేని షేక్ హుస్సేన్‌బీతో పరిచయం పెంచుకోగా అది వివాహేతర సంబంధానికి దారితీసింది. ఆపై సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం నారాయణపురానికి చెందిన చిట్టిప్రోలు సురేష్(గే)ను మరోపేరుతో పరిచయం చేసుకుని ఆయనతోనూ అక్రమ సంబంధం పెట్టుకున్నాడు. అనంతరం హైదరాబాద్‌లో ట్యాక్సీ నడిపే ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటకు చెందిన స్నేహితుడు ఫరీద్ అహ్మద్ ద్వారా ఖమ్మంలో అబిద్ గది అద్దెకు తీసుకున్నాడు. అబిద్‌తో వివాహేతర సంబంధం సాగిస్తున్న హుస్సేన్‌బీ ద్వారా ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం బుద్దారానికి చెందిన జమాల్‌బీ, ఆమెతో.. పైనంపల్లికి చెందిన షేక్ షబానా పరిచయమైంది. షబానా ప్రస్తుతం సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం తమ్మరబండపాలెంలో నివాసముంటోంది. ఆమెతో కూడా అబిద్ వివాహేతర సంబంధం ఏర్పర్చుకున్నాడు.

హత్యకు పథకం సిద్ధమైంది ఇలా...

ఒకేసారి రూ.లక్షలు సంపాదిస్తే విలాసవంతంగా జీవనం గడపొచ్చని, అందుకు దోపిడీ సరైన మార్గమని షబానాకు అబిద్ చెప్పగా ఆమె తన మేనత్త జమాల్‌బీకి చెబితే ఆమె సైతం అంగీకరించింది. అయితే, ధనవంతులై ఒంటరిగా ఉండే వారి వివరాలు చెప్పాలని జమాల్‌బీని కోరగా ఆమె ఆరు నెలల క్రితం నేలకొండపల్లిలోని కొత్తకొత్తూరుకు చెందిన రేషన్ బియ్యం వ్యాపారి వెంకటరమణ పేరు సూచించింది. వృద్ధుడైన ఆయన భార్యతో ఉంటాడని, దోపిడీ చేయడం సులువని చెప్పింది. అనంతరం కోదాడలో ఉన్న హుస్సేన్‌బీ, గే అయిన సురేష్‌ను పిలిపించి వారినీ ఒప్పించాడు. ఆపై ఖమ్మంలో సెల్‌ఫోన్ సిమ్‌లు విక్రయించే మణికంఠతో పరిచయం పెంచుకుని డబ్బు ఆశ చూపి ఎలాంటి ఆధారాలూ లేకుండా 10 సిమ్ కార్డులు, ఇంకోచోట ద్విచక్రవాహనం కొనుగోలు చేశాడు. అయితే, ఇంకో వాహనం నంబర్ ప్లేట్ చోరీచేసి తాను కొన్న వాహనానికి అమర్చాడు. ఇంతలోనే నేలకొండపల్లిలోని వెంకటరమణ ఇంట్లో ఓ పోర్షన్ ఖాళీ అయింది. దీంతో సురేష్‌ను పంపించగా ఆయన తన కుటుంబం మూడు నెలల తర్వాత వస్తుందని చెప్పినా వెంకటరమణ ఇల్లు అద్దెకు ఇవ్వలేదు. ఆ తర్వాత హుస్సేన్‌బీ, షబానా పంపగా వారికి ఇల్లు అద్దెకు ఇచ్చాడు. ఆ తర్వాత మణికంఠ వద్ద మరో ఐదు సిమ్‌లను అబిద్ తీసుకున్నాడు. హుస్సేన్‌బీ, షబానాలు వెంకటరమణ, కృష్ణకుమారితో పరిచయం పెంచుకుని తరచూ వారి ఇంట్లో టీవీ చూస్తూ భోజనం చేసేవారు. వృద్ధ దంపతుల వద్ద భారీగా బంగారం, డబ్బు ఉందనే భావనతో నవంబర్ 25న రాత్రి అబిద్, సురేష్‌లు షబానా, హుస్సేన్‌బీ ఉంటున్న పోర్షన్‌లోకి ప్రవేశించారు. కానీ ఆరోజు హత్య చేయడం కుదరలేదు. మరుసటి రోజు 26వ తేదీన రాత్రి వెంకటరమణ ఇంట్లోకి వెళ్లిన షబానా, హుస్సేన్‌బీ టీవీ చూస్తూ కృష్ణకుమారితో మాటలు కలిపారు. ఆపై అబీద్, సురేష్ ఇంట్లోకి చొరబడి షబానా, హుస్సేన్‌బీ సహకారంతో కృష్ణకుమారి గొంతు పిసికి హత్య చేశారు. ఆ తర్వాత ఆమె ఒంటిపై ఎనిమిది తులాల బంగారు ఆభరణాలు దొంగిలించారు. అనంతరం ఇంట్లో బంగారు, డబ్బుకోసం వెతుకుతుండగా శబ్దానికి నిద్ర లేచిన వెంకటరమణ పక్క గది నుంచి రావడంతో ఆయననూ హత్య చేశారు.

ఇలా చిక్కారు...

దంపతుల హత్య కేసును ఛేదించేందుకు పోలీసు కమిషనర్ సునీల్‌దత్ ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో 45మంది సిబ్బందితో ఐదు బృందాలను నియమించారు. మృతుడు వెంకటరమణకు ఫోన్ చేసిన వారి నంబర్ల ఆధారంగా 15 సిమ్‌ల కాల్‌డేటా వెలికితీశారు. దీంతో అబిద్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా విషయం బయటపడింది. ఈమేరకు ఎనిమిది మందిని అరెస్ట్‌చేసి ఎనిమిది 8తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు.

రాత్రంతా అక్కడే..

దంపతులను హత్య చేశాక బయటకు వెళ్తే పోలీసులకు పట్టుబడతామని భావించి నిందితులంతా ఇంట్లోనే గడిపారు. డాగ్ స్క్వాడ్‌కు వాసన పసిగట్టకుండా ఇంటి చుట్టూ, మృతదేహాల వద్ద కారం పొడి చల్లారు. ఇక 27న తెల్లవారుజామున అబీద్ బైక్‌పై హుస్సేన్‌బీ, షబానాను తీసుకెళ్లి ఆటోలో ఖమ్మం పంపించాడు. అనంతరం సురేష్‌కు బంగారంలో కొంత, నగదు కొంత ఇచ్చి కోదాడకు పంపాడు. ఆ తర్వాత ఖమ్మం వెళ్లిన అబిద్ పాత బస్టాండ్ వద్ద హుస్సేన్‌బీ, షబానాతో ఖమ్మంలో తాను ఉండే గదికి వెళ్లాడు. రెండు రోజుల పాటు నేలకొండపల్లికి వచ్చివెళ్తూ ఏం జరుగుతుందో తెలుసుకున్నాడు. ఆపై ఉన్న బంగారాన్ని అమ్మితే వాటా ఇస్తానని హైదరాబాద్‌లో ఉన్న స్నేహితుడైన ఫరీద్‌కు చెప్పాడు. దీంతో ఆయన ఖమ్మంలోని స్టోన్‌క్రషర్‌లో పనిచేసే విజయ్‌నగర్‌కాలనీకి చెందిన అనుమోల అనిల్‌కుమార్‌ని పరిచయం చేయడంతో ఆయనకు వాటా ఇస్తామని నమ్మబలికి బంగారం అమ్మాలని అప్పగించారు.